క్లుప్తంగా...

దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: బేగంపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో ఖాళీగా ఉన్న పలు కోర్సుల్లో అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సైన్సెస్ (35 సీట్లు), ఫిజికల్ సైన్స్ (88), బీఎస్సీ గేమింగ్ (51), బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ హానర్స్ (10) కోర్సుల్లో భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మల్లికార్జున్ ఖర్గేకు ఘన స్వాగతం



కోట నీలిమా ఆధ్వర్యంలో మల్లికార్జున్ ఖర్గేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

సనత్‌నగర్: చేవెళ్ల కేంద్రంగా శనివారం నిర్వహించిన కాంగ్రెస్ ప్రజా గర్జన సభకు ముఖ్య అతిథిగా హాజరవుతున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో ఘన స్వాగతం లభించింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా ఆధ్వర్యంలో సనత్‌నగర్ నియోజకవర్గం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. ఈ సందర్భంగా కోట నీలిమా మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ ప్రజాగర్జన బహిరంగ సభ ద్వారా అధికార పార్టీల గుండెల్లో గుబులు రేగుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పని చేసేది ఒక్క కాంగ్రెస్ మాత్రమే అన్నారు.

విదేశీ విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తాం



డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొ.శివరామకృష్ణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రవేశం పొందు విదేశీ విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తామని నూతన డైరెక్టర్ ప్రొ.శివరామకృష్ణ అన్నారు. శుక్రవారం డైరెక్టర్ ఫర్ ఆఫీస్ ఆఫ్ ద ఇంటర్నేషనల్ అఫైర్స్ (గతంలో యూఎఫ్‌ఆర్‌ఓ)గా పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు.. కరోనా అనంతరం ఓయూలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలు తగ్గాయని వారి సంఖ్య పెంచేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇంత కాలం డైరెక్టర్‌గా కొనసాగిన ప్రొ.అప్పారావు పదవీ కాలం ముగియడంతో ప్రొ.శివరామకృష్ణకు బాధ్యతలు అప్పగించారు.

పార్టీ కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలి

లాలాపేట: పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపు సులువవుతుందని ముంబై ఎమ్మెల్యే పరాగ్ అల్వానీ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం శాంతినగర్‌లో మహంకాళి జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి శారదా మల్లేష్ అధ్యక్షతన స్థానికంగా ఉన్న వివిధ వర్గాల డాక్టర్లు, లాయర్లు, కుల సంఘాల ప్రతినిధుల సమావేశంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలన్నారు. ఈ సమావేశంలో మంజీరీ నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ ఆంజనేయులు, డాక్టర్ అరుణ్ ఐనాల, మల్లేష్, నాగేశ్వర్‌రెడ్డి, రవిప్రసాద్, హరి పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండితే.. ఓటరుగా నమోదు చేసుకోండి

జోరుగా ఓటరు నమోదు కార్యక్రమం



ఓటరు నమోదు తీరును పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: పద్దెనిమిదేళ్లు నిండిన వారు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సామల హేమ సూచించారు. శనివారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఆమె సందర్శించి మాట్లాడారు. ఓటర్ నమోదు స్పెషల్‌డ్రైవ్ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందని డివిజన్ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో నూతన ఓటర్ నమోదు, అడ్రస్ మార్పు, ఇతర మార్పుల కోసం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

అడ్డగుట్ట: 18 సంవత్సరాలు పూర్తయిన వారందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని బీజేపీ నాయకులు సూచించారు. ఎన్నికల కమిషన్ అధికారులు ఓటర్ నమోదు, సవరణలకై డివిజన్‌లోని అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆదివారం కూడా ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, ఓటర్ నమోదు, సవరణలు, పోలింగ్ స్టేషన్ల మార్పు చేసుకోవాలనుకునే వారు స్థానిక పోలింగ్ బూత్‌ల వద్ద దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మద్దర్ల శ్యాంసుందర్, ఉదయ్ యాదవ్, హంసరాజు, నరేందర్, సాయిబాబా, వేణు పాల్గొన్నారు.

తార్నాకలో..

లాలాపేట: తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాల్లో అర్హులైన వారు నూతన ఓటర్లుగా నమోదు చేసుకున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఈ స్పెషల్ డ్రైవ్ ఆదివారం సైతం కొనసాగుతుంని ఇంకా నమోదు చేసుకోని వారు తమ పేర్లతో పాటు సవరణలు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ఆయా పార్టీలకు చెందిన నాయకులు, కాలనీ అసోసియేషన్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

- వినోభానగర్ సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్.స్వామి, ఉపాధ్యక్షులు కిరణ్‌కుమార్, కమిటీ సభ్యులు పాల్గొని బస్తీ వాసులతో ఓటరు నమోదు చేయించారు.

వార్డు కార్యాలయంలో..

బౌద్ధనగర్: అర్హులైన వారందరూ ఓటర్ నమోదు చేసుకోవాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం వార్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు పైబడిన వారందరూ తప్పనిసరిగా ఓటర్ నమోదు చేసుకోవాలన్నారు. అంతేకాక ఓటర్ కార్డులు సవరణలో, పోలింగ్ బూత్‌ల మార్పులకు కూడా అవకాశం కల్పిస్తూ ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న ఈ స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ఓటర్ నమోదులో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ



పోలింగ్ బూత్‌ను సందర్శించిన బీజేపీ నేతలు



వినోభానగర్ కమ్యూనిటీ హాల్ వద్ద..

'సర్వే'కి టికెట్ కేటాయిస్తే ఓడిస్తాం



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీబీ దేవేందర్

రసూల్‌పురా: ఎమ్మెల్యే అభ్యర్థి పేరు ప్రకటన రాకముందే కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య వర్గపోరు మొదలైంది. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీసీసీ మాజీ కార్యదర్శి డీబీ. దేవేందర్ పలు విమర్శలు చేశారు. శనివారం బాలంరాయి కమాన్ వద్ద ఆటో డ్రైవర్లతో సమావేశమై వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు రెండుసార్లు గెలిపిస్తే కేంద్ర మంత్రి పదవి చేపట్టిన సర్వే సత్యనారాయణ కంటోన్మెంట్ ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. సోనియాకు నేను చెపితే తెలంగాణ ఇచ్చారని ప్రగల్భాలు పలికిన సర్వే సత్యనారాయణను గత ఆరేళ్ల క్రితం పార్టీ నుంచి సస్పెండ్ చేసారని గుర్తు చేశారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకుండా కార్యకర్తలను, ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఇంట్లో కూర్చుని రాజకీయాలు చేస్తే సహించేది లేదని అన్నారు. తన అల్లుడుకు బీఆర్ఎస్ టికెట్ రాకపోవడంతో పథకం ప్రకారం కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి కంటోన్మెంట్ టికెట్ కోసం ర్యాలీగా వెళ్లి దరఖాస్తు చేయడం పార్టీ, ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. ఒకవేళ తమ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిజమైన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కాకుండా సర్వే సత్యనారాయణ కు టికెట్ ఇస్తే కచ్చితంగా ఓడిస్తామన్నారు.

కాంగ్రెస్‌కు ముస్లిం మైనార్టీల మద్దతు



నాగులూరి సాయిబాబాకు మద్దతు ప్రకటిస్తున్న దృశ్యం

చిలకలగూడ: సికింద్రాబాద్ నియోజకవర్గంతో పాటు తెలంగాణలో ముస్లిం మైనార్టీలు కాంగ్రెస్ పక్షానే ఉన్నారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా అన్నారు. పలువురు ముస్లిం మైనార్టీలు శనివారం చిలకలగూడలోని కార్యాలయంలో సాయిబాబాను కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీల అభివృద్ధి, అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లిం మైనార్టీలకు సంక్షేమ ఫలాలు అందడంతో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించారని గుర్తు చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఖయ్యూంతో పాటు పలువురు ముస్లిం మైనార్టీ మహిళలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బ్రహ్మోత్సవాలు

చిలకలగూడ: నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆలయ చైర్మన్ నోముల ఇందిరాప్రకాశరావు నేతృత్వంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నిర్వహించిన పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమతో పాటు, ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, ఇందిరాదేవి దంపతులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు.



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ప్రకాశరావు

ఈ కార్యక్రమంలో వైదిక సలహాదారు బిజుమళ్ల శ్రీనివాసశర్మ, ఆలయ ప్రధాన అర్చకులు హరిశివప్రసాదశర్మ, భక్తులు బిట్ల రఘునందన్, పాతూరి మల్లేష్, నైవేద్యం సాయి కుమార్, రమేష్‌గౌడ్, జగ్గు, ఎమ్మార్ శ్రీనివాస్, సురేష్‌లాల్, అభిషేక్, శ్రీనివాసగౌడ్, వేణు పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాల సమస్యలను పరిష్కరించాలి



పద్మ సుందరికి వినతిపత్రం ఇస్తున్న నిర్వాహకులు

అడ్డగుట్ట: మీసేవా కేంద్రాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం మారేడ్‌పల్లి మండల పరిధిలోని మీ సేవా నిర్వాహకులు తహసీల్దార్ పద్మ సుందరికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు సమస్యలపై స్థానిక తహసీల్దార్లకు వినతిపత్రాలు ఇస్తున్నామన్నారు. మీ సేవా కేంద్రాల్లో అనేక రకాల సమస్యలతో సతమతమవుతున్నామని 2017 నుంచి మీసేవా లావాదేవీలకు సంబంధించిన కమీషన్లు పెంచకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పైగా అన్ని రకాల సేవల ధరలు విపరీతంగా పెరగడంతో తమపై అధిక భారం పడుతుందన్నారు. 2018వ సంవత్సరంలో నాటి ఐటీ కమిషనర్ జయేష్ రంజన్ ఇచ్చిన ఆదేశాల మేరకు తమ కమీషన్ పెంచడంతో పాటు, రేషన్ కార్డు, పహాణీ, ఆర్వోఆర్, 1-బీ లాంటివి పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కుమార్ వంశీరాజ్, దేవయ్య, పవన్, విజయ్, రేఖా, వాణి ఉన్నారు.

బీసీ సీఎం కోసం రాజకీయ యుద్ధం చేయాలి



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బీఎల్ఎఫ్) నుంచి పోటీ చేసే 119 మంది అభ్యర్థులకు రూ.లక్ష ఆర్థిక సహాయం చేయనున్నట్లు ఫ్రంట్ చైర్మన్ నల్ల సూర్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య ఆడిటోరియంలో తెలంగాణ బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి ఆధ్వర్యంలో గద్దర్ యాదిలో పేరుతో సంస్మరణ సభ జరిగింది. కార్యక్రమానికి సమితి చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ అధ్యక్షత వహించగా ఫ్రంట్ ఛైర్మన్ నల్ల సూర్యప్రకాష్ ముఖ్యఅ తిథిగా హాజరై గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. బహుజనులు ఏకమై బీసీ ముఖ్యమంత్రి కోసం రాజకీయ యుద్ధం చేయాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై సామాజిక తెలంగాణ దిశగా పోరాడాలని గద్దర్ అంతిమ లక్ష్యం కూడా అదే అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రానికి ఇంత వరకు బీసీ ముఖ్యమంత్రి కాలేదని 2023లో బీసీని ముఖ్యమంత్రి చేయడమే తమ లక్ష్యమని సమితి చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అన్వర్‌ఖాన్, సాయికిరణ్‌మాదిగ, మేడి రమణ, రవి, జిలకర శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, సంతోష్‌ముదిరాజ్, లింగస్వామి, బద్రీ, నలిగంటి శరత్, తెలంగాణ సంపత్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బీజేపీ బైక్‌ర్యాలీ



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న బండా కార్తీక రెడ్డి

బౌద్ధనగర్: భారతీయ జనతా పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఆధ్వర్యంలో 'ఎమ్మెల్యే ప్రవాస్ యోజనా' కార్యక్రమంలో భాగంగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనా కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో దిగ్విజయంగా పార్టీ అంతర్గత సమావేశాలు సంపూర్ణంగా ముగించుకున్న సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బౌద్ధనగర్, వారాసిగూడ, సీతాఫల్‌మండి, చిలకలగూడ, మెట్టుగూడ, ఆలుగడ్డ బావి, తార్నాక, శాంతినగర్, అడ్డగుట్ట తదితర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. శనివారం డివిజన్‌లోని సంజయ్ గాంధీ నగర్‌లో యూపీహెచ్‌సీ, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో కార్పొరేటర్ పాల్గొని మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరాలు పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు మాత్రలు కూడా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, మదన్ మోహన్, స్వర్ణలత, వైద్యులు పాండు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



అడ్డగుట్ట: గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట ఆరోగ్య కేంద్రం సమీపంలోని ఫుట్‌పాత్‌పై 60-65 ఏళ్ల మధ్య వయస్సున్న గుర్తు తెలియని వృద్ధురాలు అపస్మారకస్థితిలో ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే ఆమె మృతి చెంది ఉంది. వృద్ధురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కేవలం పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో మాత్రమే ఉందని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించామన్నారు.

ప్రభుత్వ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులు, తల్లిదండ్రులతో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కవిత నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల విద్యా సంపద, క్రమశిక్షణ, వారి నడవడిక సక్రమంగా నిర్వర్తించుటకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఇంటి వద్ద పిల్లల చదువులపై తల్లిదండ్రులు కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి అధ్యాపకులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకువస్తారని, వారి భవిష్యత్ కూడా ఉజ్వలంగా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో అధ్యాపకులు రేణుకాబాయి, బాలరాజు, పద్మావతి, బబిత, ప్రశాంతి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల చోరీ

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మాతాజీనగర్ సమీపంలోని ఓ ప్రైవేటు స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభాల తీగలను దొంగలు కత్తరించుకుపోయారు. బేగంపేట నాలా అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో ఇక్కడి ఓ ప్రైవేటు స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రహరీ వెంబడి లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీనిని గమనించిన దొంగలు రాత్రికి రాత్రే మూడు స్తంభాల మధ్య ఉన్న విద్యుత్ తీగలను కత్తిరించుకుని తీసుకెళ్లారు. ఉదయం స్థానికులు స్తంభాల మధ్య ఉన్న తీగలు కనిపించకపోయేసరికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా వాహనాలకు చెందిన రెండు బ్యాటరీలు సైతం ఎత్తుకెళ్లారని స్థానికులు తెలిపారు.

మదర్ థెరిస్సా జీవితం స్ఫూర్తిదాయకం



మదర్ థెరిస్సా విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

రాంగోపాల్‌పేట్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మదర్ థెరిస్సా కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తామని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. శనివారం మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని రెజిమెంటల్ బజార్‌లోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థమైన సేవలతో విశ్వమాతగా కీర్తి గడించిన ఆమె విశ్వ మానవాళికి స్ఫూర్తిదాయకమన్నారు. మహనీయుల విగ్రహాలను రోజు చూడటం ద్వారా స్ఫూర్తి పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అల్లాడి గౌరీశంకర్, నందికంటి రవి, బాబు, బల్వంత్‌రెడ్డి, క్రైస్తవ సంఘాల నాయకుడు బెరుసలేం మత్తయ్య, యోహాను, రాజు పాల్గొన్నారు.

నకిలీ విడిభాగాల విక్రయం

కేసు నమోదు

రాంగోపాల్‌పేట్: అసలైన విడిభాగాల స్థానంలో నకిలీను విక్రయిస్తున్న ఓ సంస్థ గుట్టును రాంగోపాల్‌పేట్ పోలీసులు రట్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు మినిస్టర్ రోడ్‌లోని లక్కీ ఆటో స్పేర్ పార్ట్స్, యోగి పార్ట్స్‌పై రాంగోపాలపేట్ పోలీసులు దాడి చేయగా హ్యూండయ్ ఫోర్ వీలర్ ఆటో మొబైల్ స్పేర్ పార్ట్స్‌ను డూప్లికేట్‌గా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. పోలీసులు దాడి చేయడంతో ఈ సంస్థ యజమానులు విజయ్ పాటిల్, తన్‌జీత్ సింగ్ పరారీలో ఉన్నారు. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. మినిస్టర్ రోడ్‌లో పలు కార్ డెకోర్ సంస్థలు, విడిభాగాల విక్రయ సంస్థలు ఇలాగే డూప్లికేట్ విడిభాగాలు విక్రయిస్తున్నాయని వారి నుంచి వినియోగదారులు మోసపోకుండా ఉండాలని పోలీసులు సూచించారు.

ఉత్సాహంగా కోటి వృక్షార్చన

మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు

అమీర్‌పేట: పచ్చదనం పెంపొందించాలన్న తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రిలో కోటి వృక్షార్చన కార్యక్రమం నిర్వహించారు.అమీర్‌పేట కార్పొరేటర్ కేతినేని సరళ వైద్యులతో కలిసి ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు.మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఎస్ఆర్‌నగర్ గ్రంథాలయం పార్కులో అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ దశరథ్, వైద్య, జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు హార్టికల్చర్ మేనేజర్ జ్యోత్స్న పాల్గొన్నారు.

బంజారానగర్‌లో..

రసూల్‌పురా: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా కంటోన్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఏడో వార్డు బంజారా నగర్ కాలనీలో శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా శానిటేషన్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ మాట్లాడుతూ.. కంటోన్మెంట్ బోర్డులోని వివిధ కాలనీలు, బస్తీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని కంటోన్మెంట్ బోర్డు ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని మహేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బంజారాకాలనీ అధ్యక్షులు ఎండీ అస్లాం, కార్యదర్శి వైవీరావు, ఐటీబీ కాలనీ కార్యదర్శి జయశంకర్, అన్వర్ పాల్గొన్నారు.



ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటిన కార్పొరేటర్



గ్రంథాలయం పార్కులో..

హరితహారంతో సత్ఫలితాలు..

లాలాపేట: స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో శనివారం ఒకేరోజు నిర్వహిస్తున్న కోటి వృక్షార్చనలో భాగంగా డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి తార్నాక నాగార్జున నగర్ కాలనీ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ చేపట్టిన హరితహారం ఎన్నో సత్ఫలితాలను ఇస్తుందన్నారు. పచ్చదనం పెరిగి ప్రజలందరూ ఆహ్లాదమైన ప్రకృతిని ఆస్వాదిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు వాతావరణ సమతుల్యత ఏర్పడి సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని ప్రజలందరూ మొక్కలు నాటాలనీ వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగార్జునగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు తిరుపతి రావు, వేణుగోపాల్‌రెడ్డి, అనసూయమ్మ, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న శ్రీలత శోభన్‌రెడ్డి



బంజారా నగర్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం